జగనన్నను చూడాలని..



మాది రావులపాడు గ్రామం నేను దివ్యాంగురాలిని. నాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని దివ్యాంగ పింఛన్ వస్తుంది. దాంతో జీవనం సాగిస్తున్నాను. జగన్‌ను ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉదయం నుంచీ ఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడికి వచ్చి ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు చూశాను. చాలా ఆనందంగా ఉంది. ఆయనే మా లాంటి పేదల అభివృద్ధి ప్రదాత. జగన్‌కు ఎప్పుడూ రుణ పడి ఉంటాను.

– గెడ్డం బాల, దివ్యాంగురాలు, రావులపాడు, రావులపాలెం మండలం

జగనే మళ్లీ సీఎం



మాది రాజోలు నియోజకవర్గం గొంది గ్రామం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం ప్రవేశపెట్టిన పథకాలతో మా కుటుంబానికి ఎంతో ఆర్థిక చేయూత లభించింది. సుమారు రూ.4 లక్షల లబ్ధి చేకూరింది. ఆ అభిమానంతో మా ఊరి నుంచి ఇక్కడికి జగన్‌ను చూసేందుకు వచ్చాం. చాలా ఆనందంగా ఉంది. మళ్లీ జగనే సీఎం కావాలి. మా లాంటి పేద కుటుంబాలు బాగుండాలని కోరుకుంటున్నాం.

– జి.సులోచన, గొంది, సఖినేటిపల్లి మండలం

ప్రతి హామీ నెరవేర్చిన మహానుభావుడు



మాది వెలిచేరు గ్రామం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన మహానుభావుడు. పేద, సామాన్య కుటుంబాలు ఆయన అమలు చేసిన పథకాల ద్వారా ఆర్థికంగా బాగుపడ్డాయి. ఆనందంగా జీవిస్తున్నారు. మళ్లీ ఆయనే సీఎం కావాలి. జగన్ వస్తేనే మళ్లీ ఈ పథకాలన్నీ కొనసాగుతాయి. పేదలు బాగుంటారు. అందుకే ఆయనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం.

– మలకా అనిత, వెలిచేరు, ఆత్రేయపురం మండలం

జగనన్న క్షేమంగా ఉండాలి



పేదల సంక్షేమమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది కాలాల పాటు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం. అందుకే ఆయనకు గుమ్మడికాయలతో దిష్టి తీశాం. ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయి. ఆయన మళ్లీ సీఎం కావాలని, ఇక్కడ మళ్లీ చిర్ల జగ్గిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలని కోరుకుంటున్నాం.

– కె.మహాలక్ష్మి, గోపాలపురం, రావులపాలెం మండలం

గ్రామగ్రామానా జననేతకు జేజేలు



రోడ్ షోలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. పక్కనే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం రోడ్ షోకు హాజరైన భారీ జనసందోహం

- సీఎంను చూసేందుకు పోటెత్తిన జనం
- ప్రజల కళ్లల్లో సంక్షేమ సారథిని చూశామన్న ఆనందం
- మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ప్రజల బ్రహ్మరథం
- పార్టీ శ్రేణులు, అభిమానులతో కిక్కిరిసిన రావులపాలెం సెంటర్

కొత్తపేట/రావులపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామగ్రామానా ప్రజలు జేజేలు పలికారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం గోపాలపురం నుంచి ఆలమూరు మండలం మడికి వరకూ గ్రామగ్రామాన, జాతీయ రహదారి పొడవునా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు సీఎం జగన్‌ను చూసేందుకు ఉత్సాహంగా ఎదురు చూశారు. జగన్ బస్సుయాత్ర నిర్ణీత సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా చేరుకున్నప్పటికీ ప్రజలు మండుటెండను సైతం లెక్క చేయకుండా జగన్ కోసం ఎదురు చూశారు. బస్సులో సీఎంతో పాటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఉన్నారు. జగన్ బస్సుయాత్ర ఆయా ప్రాంతాలకు చేరుకుంటుండగా జై జగన్, జై జగ్గిరెడ్డి అంటూ నినాదాలు చేస్తూ ఘనస్వాగతం పలికారు. జాతీయ రహదారి పొడవునా ప్రజల ఉత్సాహాన్ని చూసి జగన్ చిరునవ్వుతో చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పలుచోట్ల ఆయన బస్సును ఆపి ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. గోపాలపురం నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ముమ్మిడివరప్పాడు, ఈతకోట, పొడగట్లపల్లి, వెదిరేశ్వరం, మల్లాయిదొడ్డి, రావులపాడు, రావులపాలెం వరకూ ఆయా గ్రామాల ప్రజలు జాతీయ రహదారికి నడిచి వచ్చి జగన్ కోసం వేచి చూశారు. ఆయన కనిపించగానే చేతులు ఊపుతూ జై జగనన్న, జై జగ్గిరెడ్డి అన్న అంటూ జేజేలు కొట్టారు. గోపాలపురం చెక్ పోస్టు దాటాకా, గోపాలపురం సెంటర్ వద్ద పలువురు అర్జీలు చేతపట్టి వేచి చూస్తుండగా వారి చూసిన సీఎం జగన్ బస్సును ఆపి, బస్సు మెట్ల మీద కూర్చొని వారి సమస్యలను విని వారి అర్జీలను స్వీకరించారు. మీకు తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయా చోట్ల ప్రజలతో ముఖ్యంగా మహిళలతో సీఎం ఆప్యాయంగా మాట్లాడారు. దాంతో ప్రజలు ఆనందంతో పరవశించిపోయారు. జగన్ నాతో మాట్లాడారు.. అంటూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. వారి కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది.

జగన్ బస్సు యాత్ర సాగిన తీరిలా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సాగిన తీరు 12 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా ప్రచారం పూర్తి చేసుకుని వశిష్ట వారధి మీదుగా 12 గంటల 15 నిమిషాలకు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం గోపాలపురం వద్ద జగన్ బస్సు యాత్ర ప్రవేశించింది. గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ దాటిన తర్వాత ఒకరిని, గోపాలపురం సెంటర్లో గోపాలపురం, ముమ్మిడివరప్పాడు తదితర గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు అభిమానులు ప్రజలు అత్యధిక సంఖ్యలో చేరుకుని బస్సు యాత్రకు ఘన స్వాగతం తెలిపారు. గోపాలపురంలో దళిత మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చారు.

తదుపరి ఈతకోట సెంటర్లో పలు గ్రామాల పార్టీ శ్రేణులు అభిమానులు ప్రజలు అత్యధిక సంఖ్యలో చేరుకుని జగన్‌కు ఘన స్వాగతం పలికారు. తదుపరి లక్ష్మీ పోలవరం, రావులపాడు జంక్షన్ల వద్ద పార్టీ శ్రేణులు, ప్రజలకు జగన్ అభివాదం చేశారు. రావులపాడు జయశ్రీ హాస్పిటల్ సెంటర్ వద్ద స్థానిక మహిళలు బస్సు యాత్రకు స్వాగతం పలికి బూడిద గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అనంతరం ఒంటిగంట 15 నిమిషాల సమయానికి రావులపాలెం కళా వెంకటరావు సెంటర్‌కు జగన్ యాత్ర చేరుకుంది. అక్కడ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల నుంచి వేలాది సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అక్కడికి చేరుకుని ఘన స్వాగతం పలికారు. ఆ సెంటర్లో గారడి, తీన్మార్ డప్పుల వాయిద్యాల నడుమ జై జగన్ జై జగ్గిరెడ్డి నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. అక్కడ వేలాది ప్రజానీకానికి జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తదుపరి గౌతమి బ్రిడ్జి మీదుగా ఆలమూరు మండలం జొన్నాడ సెంటర్‌కు ఒంటిగంట 39 నిమిషాలకు చేరుకున్నారు. అక్కడ ఆ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలుకుగా జగన్ వారికి అభివాదం చేశారు. అక్కడ నుంచి మూలస్థానం, చెముడు లంక, మడికి గ్రామాల కూడళ్లలో పార్టీ శ్రేణులు అభిమానులు ప్రజలు ఎదురేగి ఘన స్వాగతం పలకగా వారికి జగన్ చేయి ఊపి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఒంటిగంట 56 నిమిషాలకు మడికి దాటగా అక్కడితో కోనసీమ జిల్లాతో పాటు, కొత్తపేట నియోజకవర్గంలో బస్సు యాత్ర ముగిసింది.



జగనన్న కోసం ఎదురు చూస్తున్న కాలేజీ విద్యార్థినులు



రావులపాలెం కళావెంకట్రావు సెంటర్‌లో మేమంతా సిద్ధం రోడ్ షోకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు



సీఎం జగన్‌ను చూసి ఆనందంతో తిరిగి వెళుతున్న దివ్యాంగురాలు, మహిళలు

క్లుప్తంగా

నాయకుల చేరికతో నూతనోత్సాహం



జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన గణేష్‌బాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీలో చేరికలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతున్నాయి. ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ తాజాగా పార్టీలో చేరుతున్న వారితో మరింత బలోపేతమవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దివంగత మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు తనయుడు, మాజీ ఎంపీటీసీ నీతిపూడి గణేష్‌బాబు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన తన అనుచరులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన రాక వైఎస్సార్ సీపీకి మరింత బలాన్నిస్తుందని, పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి రాకను కూడా పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఇతర పార్టీల నుంచి చేరుతున్న నాయకులతో పి.గన్నవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తిరుగులేని శక్తిగా అవతరించిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది శుభ పరిణామమని ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాలకు శుక్ర, శని వారాలు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. జాతీయ రహదారుల విభాగం పనుల నిర్వహణలో భాగంగా అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు, నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని రవికుమార్ కోరారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి తొలి రోజైన గురువారం నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. ఈనెల 25 వరకూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు.

22న గొల్లపల్లి నామినేషన్

మలికిపురం: ఈ నెల 22వ తేదీ సోమవారం రాజోలు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ రోజు మలికిపురం నుంచి పార్టీ కార్యకర్తలతో వెళ్లి నామినేషన్ వేస్తారు.

23న ఎంపీ అభ్యర్థి రాపాక నామినేషన్

మలికిపురం: ఈ నెల 23వ తేదీ మంగళవారం అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు నామినేషన్ వేయనున్నారు. ఆ రోజు ఉదయం 12.23 నిమిషాలకు అమలాపురంలో నామినేషన్ వేసేందుకు ఆయన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా పర్యటన

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీకి మద్దతుగా బీసీ నాయకులు పర్యటించారు. ఆయా ప్రాంతాలలో సదరు సామాజికవర్గానికి చెందిన ప్రముఖులను కలసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు గెలుపునకు కృషి చేయాలని వారు కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ దొమ్మేటి ఉమామహేశ్వరరావు, నాయకులు గుబ్బల బాబ్జీ, గుబ్బల వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి

ఆత్రేయపురం: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కోట సత్యనారాయణ (24) గురువారం పురుగుమందు తాగి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అప్పుల బాధ తాళలేక మృతి చెందినట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జగన్మోహినీ కేశవస్వామికి ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా జగన్మోహినీ కేశవ స్వామికి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యాపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట

రాజోలు: బ్రాహ్మణ సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. గురువారం ఆయన కడలి గ్రామంలో పర్యటించారు. స్థానిక బ్రాహ్మణ సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బ్రాహ్మణులంతా కలసికట్టుగా వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ధూప, దీప నైవేద్యానికి లోటు రాకుండా ఉండేందుకు చిన్న దేవాలయాలకు ఆర్థిక తోడ్పాటు అందించారన్నారు. అమలాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులను విజయపథంలో నిలపాలన్నారు. నాయకులు కాదంబరి రవి, రామ్మోహనరావు, సూర్యనారాయణ మూర్తి, మైలవరపు వెంకటేష్ పాల్గొన్నారు.



కడలిలో బ్రాహ్మణ సంఘ నాయకులతో రాష్ట్ర బ్రాహ్మణ సంఘ చైర్మన్ పీకే రావు

ప్రజాకోర్టులో ప్రతిపక్షాలకు తగిన శాస్తి ఖాయం

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాకోర్టులో ప్రజలు ఇచ్చే తీర్పుతో ప్రతిపక్ష కూటమికి తగిన శాస్తి జరగడం ఖాయమని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం రాత్రి రామేశ్వరం అంబేడ్కర్ నగర్‌లో పార్టీ యూత్ నాయకుడు కొల్లాబత్తుల టోనీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గొల్లపల్లిని స్థానికులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు అంతా ఐకమత్యంతో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. మనందరి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 124 సార్లు బటన్ నొక్కారని, ఆయనను తిరిగి సీఎం చేసుకోవడానికి మనం రెండు బటన్‌లు, అటు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఇటు ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తులపై నొక్కాలని కోరారు. కాగా తమ గ్రామం నుంచి పార్టీకి 1000 ఓట్లు మెజార్టీ సాధించేలా చూస్తామని వారు గొల్లపల్లికి వివరించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు సరెళ్ల విజయ్ ప్రసాద్, నల్లి డేవిడ్, కె.కుమార్, బళ్ల లక్ష్మణ్, తాడి సహదేవ్, ఇంజేటి చిట్టిబాబు పాల్గొన్నారు.



రామేశ్వరంలో అంబేడ్కర్ నగర్‌లో గొల్లపల్లిని సత్కరిస్తున్న స్థానికులు

రాష్ట్రంలో ప్రజాదరణ కలిగిన శక్తి జగనే..

అయినవిల్లి: ఎటుచూసిన, ఎక్కడ చూసిన రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే కోరుకుంటున్నారని, రాష్ట్రంలో అత్యధిక ప్రజాదరణ కలిగిన శక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగారని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు తనయుడు విప్పర్తి రామ్మోహనరావు అన్నారు. మండలంలోని సిరిపల్లిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. రామ్మోహనరావుకు గ్రామ ప్రజలు మంగళహారతులు పట్టి, పూలదండలతో స్వాగతం పలికారు. రామ్మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మునుపెన్నడు లేని విధంగా పేదలకు సంక్షేమ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చారన్నారు. ప్రకృతి విపత్తుల్లోనూ ప్రజలను అందుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో అందరూ ఇంటికే పరిమితమైతే వలంటీర్ల ద్వారా అనేక సేవలను అందించారని గుర్తు చేశారు. మరోసారి ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి సీఎంగా జగన్‌ని, ఎమ్మెల్యేగా తన తండ్రి విప్పర్తిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కేతా గోవిందు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైస్ ఎంపీపీ బయ్యా చిన బాబు, ఎంపీటీసీలు యడ్ల కిరణ్‌కుమార్, రావూరి వెంకటరామారావు, పచ్చిమాల సుబ్బారావు, సర్పంచులు కుడుపూడి శాంతివతి, బొక్కా కామేశ్వరరావు, కుసుమ లిల్లీమంగేష్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సిరిపల్లిలో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న విప్పర్తి తనయుడు రామ్మోహనరావు

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజోలు అగ్నిమాపక కేంద్రం అధికారి బి.బాలకృష్ణ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం మామిడికుదురు దీప్తి విద్యా సంస్థల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న మంటలను ఆర్పే కార్బన్‌డైఆక్సైడ్ పరికరాన్ని ఏ విధంగా ఓపెన్ చేయాలన్న విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న గో ఫ్రెష్ సూపర్ మార్కెట్ వద్ద కూడా డెమో ప్రదర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలు పంచారు. దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించాలి



అంబాజీపేటలో అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ నాగసుకన్య

అంబాజీపేట: మద్దతు ధరకే వరి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సొసైటీ సీఈఓలకు, వీఏఏలకు, టీఏ, డీఈలకు రబీ ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కనీస మద్దతు ధర సాధారణ రకం 75 కిలోలకు రూ.1,637, గ్రేడ్ ఏ రకం 75 కిలోలకు రూ.1,652 వంతున ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. ఈ రబీ పంటలో చిరతపూడి, ఇసుకపూడి ఒక క్లస్టర్‌గాను, మాచవరం 1, 2, 3, 4 సచివాలయాలు క్లస్టర్‌గాను, పుల్లేటికుర్రు 1, 2 సచివాలయాలు క్లస్టర్‌గాను, మొసలపల్లి, ఇరుసుమండ క్లస్టర్‌గాను, ముక్కామల, పసుపల్లి క్లస్టర్‌గాను, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం క్లస్టర్‌గా ఏర్పాటు చేశామన్నారు. ఆయ క్లస్టర్‌ల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తారన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ అసిస్టెంట్‌లు సీహెచ్ నాగసుకన్య, జి.సాయి కిరణ్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎండీ ఇబ్రహీం, సొసైటీ సీఈఓలు కె.అయ్యప్పనాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.